ఈవారం కథ

# పనిమనిషి

— డాక్టర్ మమత

రంగమ్మ పనిలోకిరాక ఈ రోజుకు వారం అయింది. ఒక దానికొకటి కలసి అంటుపాత్రలూ, బట్టలూ ఇంటినిండా పడి వున్నాయి. శక్తిమేరకు పాత్రలు, చీరలు, నైటీలు, నేనే ఉతకడం మొదలెట్టాను. మామూలు రోజులలో అయితే పనంతా ఏదో విధంగా మెల్లగా చేసుకోవచ్చు. కానీ ఇప్పుడు నా పెద్ద కూతురు కాన్పుకు వచ్చింది. ఇంట్లో గర్భవతీ, పిల్లలూ వుంటే ఇక పనికి కొరతేం వుంటుంది? వుండేది నేనొక్కదాన్ని, ఇంకొక కూతురు ఇంటర్న్షిప్ చేస్తున్నది. ఉదయాన్నే ఆఫీసు పని మీద బయటకెళ్ళే భర్త, వాళ్ళిద్దరి నుంచీ నాకు ఎటువంటి సహకారం వుండదు. పైగా చేసిన వంటలో కాస్త ఎక్కువ, తక్కువైతే నోరెత్తకుండా తింటే అదే నా పుణ్యం. ఎప్పుడూ నవ్వుతూ కేరింతలు కొట్టే మనవడు. నిద్రలో కూడా వాడి ముఖం ప్రతి పది నిమిషాలకైనా చూడాలనిపిస్తుంటుంది. వాడి ముద్దు మురిపాలలో మరింత మిగులుతుంది పని. ఇంటి పనులు, వంట పనులు అన్నీ చేసుకుంటూ అందరిమీదా కోపం, ఒక్కొక్కసారి చిన్న పాటి పోట్లాటలు, ఈ పరిణామాలన్నీ పని మనిషి రంగమ్మ వల్లనే వచ్చాయని పించింది.

రంగమ్మ పనిలోకిరాని మొదటిరోజు ఆమె భర్త వచ్చి "కోడలికి నొప్పులు వస్తున్నాయి, రెండు రోజులు పనిలోకి రావడం కుదరదమ్మా" అని చెప్పి వెళ్ళాడు. కానీ రెండు రోజులు పోయాయి, మూడు రోజులు పోయాయి. వారం అయింది. రంగమ్మ రాలేదు. ఆమె జాడకూడా తెలియలేదు. ఎంత సహాయం చేస్తుండేదాన్ని! దానికి కొద్దిగానైనా విశ్వాసముందా?

"అమ్మా! నేనొకటడుగుతాను తమరు లేదన కూడదమ్మా" అని మెల్లమెల్లగానే అడుగుతుండేది. రెండు నెలలకొక చీరె, లంగా, నాలుగైదు రోజులకొకసారి అడ్వాన్స్ పేరిట ఇరవై, యాభై, డబ్బులు, ఇంట్లో ఎవరికి జలుబు, జ్వరం వచ్చినా నా కూతురిచేత ఉచితంగా మందులు, ఇంత చేస్తున్నామే ఏ మాత్రం విశ్వాసం వున్నా మధ్యలో ఒకసారి వచ్చి "ఇదమ్మా పరిస్థితి, నాకు రాను ఇపుడే కుదరదు" అని ఒక్క మాట చెప్పి వెళ్ళవచ్చుకదా! దానికి నా కష్టం కొంచెం కూడా అర్థం కావడం లేదు. "'హ వెళ్ళకపోతే ఏంటట, మహా అయితే పనిలోనుండి తీసేస్తారు అంతేకదా" అనే కదా దాని నిర్లక్ష్యం. దానికే అంత గర్వం వుంటే, నాకెంతుండాలి? నా అసహనానికి తోడు "ఇంకా ఆమె కోసం ఎన్నిరోజులు చూస్తూ కూర్చుంటావు? వేరే ఎవరినైనా పిలుచుకుంటే పోదూ" అనే భర్తా, కూతురూ మాటలు మరో వైపు. ఇక దానికోసం ఇలాగే నిరీక్షిస్తూ కూర్చుంటే లాభం లేదనిపించింది. ప్రత్యామ్నాయ మార్గం వెతకక తప్పలేదు.

మా కాలనీలోనే వున్న సుభద్ర అప్పుడప్పుడూ మా ఇంట్లో జరిగే శుభకార్యాలకు వచ్చి వంటా వార్పూ, ఆ పనీ ఈ పనీచేసి మిగిలినవీ, తగిలినవీ తీసుకెళ్తుండేది. అందువల్ల నేను పిలిస్తే సుభద్ర పనిలోకిరానని అనదు అనే నమ్మకం నాకుండింది. కబురంపిన అరగంటలోనే వచ్చింది సుభద్ర. రంగమ్మ పనిలోకి రాని సంగతి తనకూ ఎరుకే.

"చూడు సుభద్రా ఇంతపని వుంది. ఇంత జీతం ఇస్తాను కానీ తిండికేం కొరత వుండదు. నేనేం తింటే మీకూ అదే పెట్టే మనస్తత్వం నాది" అని చెబుతుంటే దాని ముఖం విచ్చుకుంది. "ఇంకా మా హోటల్ మజ్జిగ అవీ వుంటాయి రోజూ తీసుకెళ్ళవచ్చు. నీవు సరైన పద్ధతిలో వుంటే నీకు కావలసిన సహాయం చేస్తాను" అని ఇంకా చెప్పకొచ్చాను.

"ఎందుకమ్మా ఇదంతా! మీరేమైనా చెపితే నేను చెయ్యకుంటానా" అని నవ్వు ముఖంతో అంది. అయినా నేను మళ్ళీ చెప్పాను. "అంతేకాదే నా పిల్లలవి చుడీదార్, లంగా, దావణి చాలా వున్నాయి

కొద్ది రోజులయ్యాక ఇస్తాలే" మొత్తానికి దానిని మనస్ఫూర్తిగా పనిలోకి ఒప్పించడమే నా ధ్యేయం. ఆతృతలో జ్ఞప్తికొచ్చినవన్నీ చెప్పేశాను.

నేను చెప్పే ప్రతిమాటకూ "అలాగేనమ్మా, సరే నమ్మా" అని సుభద్ర ఆశ కన్నులతో జవాబిచ్చింది. నాది కొంచెం పెద్ద చెయ్యి అని, రోజూ రంగమ్మ పని ముగించుకుని పోతున్నప్పుడు చూసిన సుభద్రకూ తెలుసు.

"హు... ఆ రంగమ్మ రాకపోతే ఏం మరో వుల్లమ్మ! పని మనుషులే కరువా" అని మనసులోనే అనుకుని "సరే సుభద్రా రేపటి నుంచి పనిలోకి రా!" అంటే "సరే" నన్నదే కానీ దాని ముఖంలో మునుపటి కాంతి లేదు. ఎందుకో కానీ పనిలోకి చేరడానికి వెనుకడుగు వేస్తున్నదనిపించింది. దాని డిమాండ్స్ ఇంకా ఏమైనా వున్నాయేమో అనిపించింది.

"ఇంకా ఏమిటే సుభద్రా! నీకేమైనా కావాలంటే ఇప్పుడే అడుగు" ఆమెకు ఏ విధమైన అసంతృప్తి వుండకూడదని అన్నాను. ఈ సుభద్ర కాదంటే మరో మనిషిని పట్టుకోడానికి ఇంకెన్ని రోజులు పడుతుందోనని ఒక వైపు భయపడుతూనే.

సుభద్ర "ఏం లేదమ్మా" అన్నదే కానీ దాని జంకు మాత్రం పోలేదు. ఇక ప్రశ్నించలేదు. "సరే అయితే, రేపటి నుంచి వచ్చేయ్" అని చెప్పి ఆమెను పంపి గేటు వేసి లోపలికొచ్చాను అంతే. ఇంతలోనే ఎవరో గేటు తెరిచిన చప్పుడైంది. తలుపుతీసి చూస్తే ఎదురుగా సుభద్ర! దగ్గరగా వచ్చి తలవంచుకొని చేతులు నలువుకుంటూ మెల్లగా చిన్న స్వరంతో చెబుతున్నది "అమ్మగారూ మా ... దేమో నాకైతే తమరింట్లో పనికి చేరాలని వుందమ్మా! కానీ రంగమ్మ కడుపు కొడితే దేవుడు నన్ను క్షమించడమ్మా! దాందీ నాలాంటి బతుకేనమ్మా. పేదల బతుకు. ఇప్పుడు నేను రంగికి అన్యాయం చేస్తే రేపు మరొక రెవరైనా నాకు అన్యాయం చేస్తారమ్మా. పాపం రంగి కోడలు కాన్పు అయిందట పసిపిల్లకు ఏదో ట్యూబు పెట్టారట. ఒంటి ఆడది ఎన్ని కష్టాలో ఏమో. రెండు రోజులు వెనకో, ముందో మీకు కష్టమైతే రంగి పనిలోకి వచ్చేదాకా సాయం చేసిపెడతానమ్మా. ఖాయంగా పనిలో రంగినే వుండనీయండమ్మా. ఎదుటోళ్ళ కష్టం మనం అర్థం చేసుకొంటే మన కష్టం తెలుసుకొనేందుకు పక్కనోళ్ళుంటారమ్మా" అంది. మెల్లగా చెప్పినా గట్టి నిర్ణయంతోనే చెప్పింది. నాలో కొత్త ఆలోచన రేకెత్తింది.

ఇంతవరకూ నా కష్టం రంగమ్మ అర్థం చేసుకోలేదనుకున్నానే కానీ తన కష్టం నాకర్థం కాలేదు! ఆ సత్యం సుభద్రవల్ల తెలిసింది. పనిలో చేర్చుకోటానికి నేను చూపెట్టిన ప్రలోభాలన్నీ కాదనుకుని సాటి మనిషి సమస్యను అంత బాగా అర్థం చేసుకున్న సుభద్ర ఆస్తి, ఐశ్వర్యంలో నాకన్నా తక్కువైనా, నిష్కల్మష హృదయంతో నాకంటే ఎంతో ఎత్తున వుందనిపించింది. చదువూ, సంధ్యలులేని ఈ సామాన్యులకు ఇంత పరిజ్ఞానం వుంటుందని తొలిసారిగా అప్పడర్థమయింది నాకు. ☆



భారతీయ జానపదం:

డా.దేవరాజు మహారాజు

## పరులసేవ

ఒకానొక గురువుగారు తనకు అత్యంత ప్రియమైన శిష్యుణ్ణి దగ్గరికి పిలిచి, అంతటితో అతని విద్య పూర్తయ్యిందని, బదులుగా గురుదక్షిణ ఇవ్వమని అడిగాడు. గురువుగారు ఏది కావాలని కోరుకుంటారో తాను అది ఇవ్వడానికి సిద్ధమని-శిష్యుడు తన అంగీకారాన్ని తెలిపాడు.

గురువుగారు ఒక్క క్షణం కళ్ళుమూసి తెరిచి తన భవిష్యత్తు తాను తెలుసుకున్నానని, కొద్దిరోజుల్లోనే తాను చనిపోబోతున్నానని, తరువాత కొద్ది రోజులకే ఆ ఎదురుగా చెత్తకుప్పమీద తిరిగే పందికి నాలుగో సంతానంగా పుట్టబోతున్నానని, పుట్టగానే తనను చంపి ఆ నీచ జీవితం నుండి తనకు విముక్తి ప్రసాదించమని శిష్యుణ్ణి కోరాడు.

రాబోయే జన్మ గురించి గురువుగారు మానసికంగా మథన పడుతున్నారని శిష్యుడు గ్రహించాడు. ఏమైనా గురువాజ్ఞ శిరసావహించవలసిందే!

పందికి పుట్టబోయే నాలుగోకూనకు, కనుబొమల మీద పెద్ద మచ్చలుంటాయని గురువుగారు ఒక బండగుర్తు కూడా చెప్పారు. శిష్యుడు శ్రద్ధగా విన్నాడు. కొద్దిరోజులు గడిచాయి. గురువుగారు చెప్పినట్లుగానే చనిపోయారు. మరికొన్ని రోజులకు పెంటదిబ్బమీద పంది, పిల్లల్ని కన్నది నాలుగో కూనకు కనుబొమల మీద మచ్చలు కూడా కనిపించాయి. గురువుగారికి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే శిష్యుడు ఆ పందికూనను చంపెయ్యాలి. శిష్యుడు కత్తి బాగా నూరుకుని, పందికూన తల ఒక్కవేటుతో నరికేయాలని సిద్ధపడ్డాడు.

శిష్యుడు పందికూన దగ్గరికి వెళ్ళగానే "ఆగు! నన్ను చంపొద్దు"- అని పందికూన మానవ స్వరంతో అర్థించింది. శిష్యుడు బిత్తరపోయాడు.

"కుమారా! ఆశ్చర్యపోకు!! నేను నిన్ను చంపమన్నమాట నిజమే కాని, నాకు అప్పుడు పంది జీవితమెంత ఉత్కృష్టమైందో తెలియదు. చెత్త, కుళ్ళు, అశుద్ధం అంతా తింటూ పారిశుద్ధ్యాన్ని పరిరక్షిస్తూ మానవసేవ చేసుకుంటున్న ఈ జన్మ ఎంతో విలువైంది. సొళ్ళు కబుర్లు నీతిబోధలు చేస్తూ పరులమీద ఆధారపడిన నా గత జీవితం కంటే; కష్టపడి పనిచేస్తూ, మానవ సేవలో మాధవసేవను పొందుతున్న ఈ జీవితమే గొప్పది - నేను నిజం గ్రహించాను. నన్ను ఇలానే బ్రతకనీయ్. ఉపయోగకరమైన బ్రతుకు బ్రతకనీయ్" - అంటూ పందికూన పెంటదిబ్బ మీదికి పరిగెత్తింది. ■